
సాక్షి పల్నాడు

ఆదివారం । 10 । డిసెంబర్ । 2023



సందర్శకులకు అనుమతి

యడ్లపాడు: కొండవీడు కోటకు సందర్శకులను ఆదివారం నుంచి అనుమతించనున్నారు. విరిగి పడిన బండరాళ్ల తొలగింపు పనులు శనివారం చేపట్టారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: సాగర్ నీటి మట్టం శనివారం 522.30 అడుగుల వద్ద ఉంది. ప్రధాన జల విద్యుత్ కేంద్రానికి 23,030 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీకి 1,350 విడుదల చేస్తున్నారు.

సత్రశాలలో కార్తిక పూజలు

రెంటచింతల: పల్నాడు జిల్లా సత్రశాలలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో శనివారం కార్తిక పూజలు నిర్వహించారు. కృష్ణానది ఒడ్డున కార్తిక దీపాలు వెలిగించి పుణ్య స్నానాలు చేశారు.



న్యూస్‌రీల్

పల్నాటి ఉత్సవాలకు కలెక్టర్‌కు ఆహ్వానం



కారెంపూడి: పల్నాటి వీరారాధన ఉత్సవాలకు కలెక్టర్ లోతేటి శివశంకర్‌ను వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ ఆహ్వానించారు. పల్నాటి ఉత్సవాల ఆహ్వాన పత్రికను కలెక్టరేట్‌లో పీఠాధిపతి శనివారం అందించారు. 12వ తేదీ నుంచి పల్నాటి రణక్షేత్రం కారెంపూడిలో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయని పీఠాధిపతి తెలిపారు. గత ఏడాది మందపోరు నాడు బ్రహ్మనాయుడు చాపకూడు సహపంక్తి భోజనాల అమలు కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. పల్నాటి వీరాచార పీఠం నిర్వాహకుడు విజయ్ కుమార్ కూడా పీఠాధిపతి వెంట ఉన్నారు.

అమరేశ్వరునికి లక్ష బిల్వార్చన



అమరావతి: పంచారామ క్షేత్రాలలో ప్రథమారామ క్షేత్రమైన అమరావతి అమరేశ్వరాలయంలో శనివారం దాతల సహకారంతో అమరేశ్వరునికి లక్షబిల్వార్చనను అత్యంత భక్తిశ్రద్ధలతో ఆలయ అర్చకులు, వేదపండితులు నిర్వహించారు. ఆలయ వేదపండితులు తొలుత మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం రుద్రహోమం నిర్వహించారు. అనంతరం స్వామివారికి విశేషాలంకారం చేసి సహస్రనామాలతో రుత్విక్కులు అమరేశ్వరునికి లక్ష బిల్వాదళార్చన నిర్వహించారు. బాలచాముండేశ్వరిదేవి అమ్మవారికి లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

రేపటి నుంచి టీకాల కార్యక్రమం

నరసరావుపేట: మిషన్ ఇంద్ర ధనస్సు కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని గర్భిణులు, ఐదేళ్లలోపు పిల్లలకు ఈనెల 11 నుంచి 16వ తేదీ వరకు టీకాలు వేయనున్నట్లు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి బి.రవి శనివారం తెలిపారు. ఆశ కార్యకర్తలు టీకాలు సక్రమంగా తీసుకోని వారిని గుర్తించినట్లు చెప్పారు. అందులో 64 మంది గర్భిణులు, 594 మంది పిల్లలు ఉన్నట్లు వివరించారు. ముఖ్యంగా సంచార జాతులు, కర్మాగారాల్లో పనిచేస్తున్న ఇతర రాష్ట్రాల పనివారు, వలస కూలీలు, పట్టణ మురికివాడలలో నివసిస్తున్న వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవటం జరుగుతుందని పేర్కొన్నారు. తల్లులు తమ బిడ్డలకు టీకాలు ఇప్పించి వారిని ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించిన కేంద్ర బృందం



తాడేపల్లి రూరల్: మంగళగిరి- తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని సీతానగరంలోని పట్టాభిరామయ్య కాలనీ, గండాలయ్య పేటలోని అంగన్‌వాడీ కేంద్రాలను కేంద్ర శిశు సంక్షేమ శాఖ బృందం శనివారం పరిశీలించింది. ఆంధ్రప్రదేశ్‌లో అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు, చిన్నారులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అందిస్తున్న పౌష్టికాహారం, నిర్వహణను పరిశీలించారు. గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి కేంద్రం నుంచి వచ్చిన శిశు సంక్షేమ శాఖ కేంద్ర బృందానికి ఆంధ్రప్రదేశ్‌లో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం వివరాలను వివరించారు. కార్యక్రమంలో కేంద్ర బృందంతో పాటు తాడేపల్లి తహసీల్దార్ మల్రెడ్డి నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీలు పిలుస్తున్నాయి..

అంగన్‌వాడీ కేంద్రాలకు సకల సౌకర్యాలు సమకూరాయి.. చిన్నారులను ఇట్టే ఆకర్షిస్తున్నాయి.. ప్రాథమిక స్థాయి నుంచే ఆరోగ్యం.. విద్య పునాదులు పటిష్టం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంది. గర్భిణులు, బాలింతలకు అందించే సేవలను విస్తృతం చేశారు. ఆరోగ్య సలహాలకు కేంద్రాలు.. కీలక భూమిక వహిస్తున్నాయి.

- నాడు- నేడుతో మారిన రూపురేఖలు
- కార్పొరేట్ తరహాలో చిన్నారులకు ప్రీ ప్రైమరీ విద్య

యడ్లపాడు: శిథిల, చీకటి గదుల్లో..అసౌకర్యాల నడుమ అధ్వానంగా కొనసాగిన అంగన్‌వాడీ కేంద్రాలు ఇప్పుడు అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నాయి. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మంచి పౌష్టికాహారం, విద్య, ఆరోగ్యం అందించాలనే లక్ష్యంతో నెలకొల్పిన ఈ అంగన్‌వాడీ కేంద్రాలు గతంలో తెరవని పరిస్థితిలో ఉండేది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు- నేడు కార్యక్రమంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో నూతన హంగులు సంతరించుకుంటున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల మాదిరిగానే సకల సదుపాయాలతో అంగన్‌వాడీ కేంద్రాల రూపురేఖలు పూర్తిగా మారిపోతున్నాయి.

అంగన్‌వాడీలకు అద్దె పెంపు..

పల్నాడు జిల్లాలో మొత్తం 2010 అంగన్‌వాడీ, మరో 21 మినీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 533 కేంద్రాలు సొంత భవనాలు ఉండగా, 406 కేంద్రాలు ప్రభుత్వ భవనాల్లోనూ, మిగిలిన 1092 అద్దె భవనాల్లో ఉన్నాయి. ఈ కేంద్రాల నిర్వహణకు గతంలో అద్దెలకు తమ ఇళ్లను ఇచ్చేవారు కాదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2022 అక్టోబరు ఒకటి నుంచి అద్దె ధరను పట్టణ ప్రాంతాల్లో రూ.6 వేలు, గ్రామాల్లో రూ.2 వేలు చొప్పున పెంపుదల చేసింది.



అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం తీసుకుంటున్న చిన్నారులు



యడ్లపాడు అంగన్‌వాడీ కేంద్రంలో కొత్తగా కల్పించిన ఫర్నీచర్‌పై చిన్నారులు

సేవలు ఇలా...

కేంద్రాలలో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పౌష్టికాహారం(రాగి పిండి, ఖర్జురాలు, అటుకులు, చిక్కీలు, బెల్లం), బాలమృతం, రైసు, దాల్, ఆయిల్ కేంద్రం ఇస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం అదనంగా పాలు, కోడిగుడ్లు అందజేస్తోంది. ఇవి గాక ఫస్ట్‌ఎయిడ్ మెడికల్ కిట్లు, మహిళలు, పిల్లల ఎత్తు, బరువు కొలిచే యంత్రాలను అన్ని కేంద్రాలకు ఇచ్చారు. వీరి ఆరోగ్య వివరాలు సేకరించి వైద్య సిబ్బంది, కార్యకర్తలు, ఆయాలు కలసి వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నారు. పిల్లలకు పలకలు, పీపీ-1,2 పుస్తకాలు ఇచ్చి బోధనపై శిక్షణ ఇచ్చారు. వైఎస్సార్ ఇంగ్లిష్ మీడియం ఫౌండేషన్ స్కూల్స్ నిర్వహణకు ఐటీసీ సంస్థ ప్రథమ్ పేరిటా భాగస్వామ్యమై బోధనపై శిక్షణ, పిల్లల అభివృద్ధికి సహకారం అందిస్తోంది.

అంగన్‌వాడీ కేంద్రాలు	- 2,031
గర్భిణులు	-12,411
బాలింతలు	-13,335
3 ఏళ్లలోపు చిన్నారులు	-65,092
3-6 ఏళ్ల మధ్య చిన్నారులు	-50637

మెటీరియల్...

ఇప్పటి వరకు అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులకు ఏ ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించలేదు. మండల నిధులతోనే స్థానిక నాయకులు చొరవతో బాగుచేసేవారు. నాడు- నేడు రెండు కింద జిల్లాలో 149 కేంద్రాలకు నిధులు వచ్చాయి. 113 కేంద్రాలకు రూ.5 లక్షలు నిధుల రాగా వీటితో రూ.2.50 లక్షలతో రిపేర్లు చేశారు. మిగిలిన రూ.2.50 లక్షలతో క్రీడా వస్తువులు, ఫర్నీచర్‌కు వినియోగించుకోవాల్సి ఉంది. మరమ్మతులు అవసరం లేని మరో 36 కేంద్రాలకు ఒక్కొక్కదానికి రూ.2.5 లక్షల నిధులు రాగా వాటితో మూన్‌టేబిల్, చైర్స్, జారుడుబల్ల, ఉయలబల్ల వంటివి కొనుగోలు చేయనున్నారు.



పిల్లల ఎత్తు కొలత తీస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

నాడు- నేడు రెండో దశలో కొత్తభవనాలు



లింగంగుంట్లలోని వైఎస్సార్ ఇంగ్లిష్ మీడియం ఫౌండేషన్ భవనం

నాడు- నేడు రెండో దశలో జిల్లాలో మొత్తం 13 కొత్త భవనాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఒక్కొక్క భవనానికి రూ.13.5 లక్షల చొప్పున ఆర్‌ఐడీఎఫ్, ఎన్‌ఆర్ఈజీఎస్, ఏపీఐసీ, ప్రపంచ బ్యాంక్ నిధులతో నిర్మించింది. ఇప్పటికే జిల్లాలో 533 కేంద్రాలకు సొంత భవనాలు ఉండగా, మరో 13 భవనాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి.

నాడు- నేడు ఫేజ్-2 బీ కింద...

అంగన్‌వాడీల మరమ్మతులకు తాజాగా 514 కేంద్రాల్ని ప్రభుత్వం ఎంపిక చేసింది. వాటిలో ప్రధానంగా తాగునీరు, మరుగుదొడ్లు, నీటి సరఫరా, విద్యుత్, రంగులు ఇతర సమస్యల్ని గుర్తించింది. ఆయా పనుల్ని నిర్వహణకు ప్రత్యేకంగా 'అంగన్‌వాడీ అభివృద్ధి కమిటీల్ని' ఏర్పాటు చేస్తున్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్, కార్యకర్త, స్కూల్ హెచ్‌ఎం, ఇంజినీరింగ్ అసిస్టెంట్, చిన్నారుల తల్లులు ముగ్గురు ఈ కమిటీ సభ్యులుగా ఉంటారు.

సౌకర్యాలు చేకూరాయి



నాడు-నే డుతో అంగన్‌వాడీలకు అన్ని సౌకర్యాలు చేకూరాయి. మంచి ఆహారం, చక్కని విద్య, ఆకర్షణయమైన ప్రాంగణం, పరిసరాల పరిశుభ్రత. వారితో పాటు గర్భిణులు, బాలింతలకు మంచి పౌష్టికాహారం అందిస్తున్నాం. ముఖ్యంగా ఆరోగ్యం పరిరక్షణ, పిల్లల ఎదుగుదలపై ప్రత్యేక దృష్టి సారించి కార్యకర్తలు, ఆయాలు, వైద్యసిబ్బంది కలిసి సేవలందిస్తున్నారు.

–బి.అరుణ, పీడీ, ఐసీడీఎస్, పల్నాడు జిల్లా

చిన్నారుల భవితకు..



చిన్నారుల భవిత కోసం ఆటపాటలతో ప్రీ ప్రైమరీ విద్యను ప్రభుత్వం అందిస్తోంది. పిల్లల శారీరక, మానసిక పరిపక్వతకు సృజన, సామాజిక, గణితాభివృద్ధి అంశాలపై బోధన. దీనిపై సీడీపీఓలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, స్కూల్ టీచర్లకు సమష్టిగా గతనెలలో శిక్షణ ఇచ్చాం.

–ఎం.జోజమ్మ, సూపర్‌వైజర్ సొలస సెక్టార్

ఓటరు జాబితా కూర్పునకు పార్టీలు సహకరించాలి

జిల్లా ఎలక్ట్రోరల్ పరిశీలకుడు శ్రీధర్

నరసరావుపేట: ఓటరు జాబితా బాగుంటేనే పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగుతుందని జిల్లా ఎన్నికల ప్రత్యేక పరిశీలకుడు బి.శ్రీధర్ అన్నారు. కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ఓటరు జాబితా కూర్పునకు సహకరించాలని కోరారు. వచ్చే ఏడాది పార్లమెంట్‌తో పాటు అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఓటరు జాబితా సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఏడాది ఓటరు సమ్మరీ రివిజన్ ఉంటుందని, అయితే ఎన్నికలు రాబోతుండటంతో ఈసారి సమ్మరీ రివిజన్‌పై రాజకీయ పార్టీలు దృష్టి సారించాయని వివరించారు. ఇప్పటి వరకు పది సార్లు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి అభిప్రాయాలు తీసుకున్నట్లు చెప్పారు. జనవరి 2024 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలనే ధ్యేయంతో ఎన్నికల అధికారులు పనిచేస్తున్నారని వెల్లడించారు. సమావేశానికి హాజరైన నరసరావుపేట, వినుకొండ, పెదకూరపాడు ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు, నంబూరు శంకరరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు, మాచర్ల, నరసరావుపేట నాయకులు జూలకంటి బ్రహ్మారెడ్డి, డాక్టర్ చదలవాడ అరవిందబాబు, కాంగ్రెస్ పార్టీ, బీజేపీ జిల్లా అధ్యక్షులు అలెగ్జాండర్ సుధాకర్, ఆలోకం సుధాకర్‌బాబు, జనసేన పార్టీ నాయకులు పాల్గొని తమ నియోజకవర్గాల్లో చేర్పులు, మార్పులపై పలు అభ్యంతరాలను వ్యక్తం చేశారు. వాటిని నమోదు చేసుకున్నారు. సమావేశంలో కలెక్టర్ ఎల్.శివశంకర్, డీఆర్వో వినాయకం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పరిశీలకుడు శ్రీధర్, వేదికపై కలెక్టర్ శివశంకర్, డీఆర్వో వినాయకం

పెండింగ్‌లో 55,877 ఫారాలు..

జిల్లాలో ఎస్ఎస్ఆర్-23లో ఈ ఏడాది జనవరి ఆరో తేదీ నుంచి ఇప్పటి వరకు 3,18,112 ఫారంలు అందితే వాటిలో 2,62,231 పరిష్కరించినట్లు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ వెల్లడించారు. ఇంకా 55,877 పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. సమీక్ష సమావేశం అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై విచారణ ఈనెల 26వ తేదీ నాటికి పూర్తి చేసి, జనవరి ఐదో తేదీన తుది జాబితా ప్రకటించనున్నట్లు చెప్పారు. వీటిలో ఓటరు నమోదు కోసం ఫారం-6 కింద 1,11,385 వస్తే అందులో 93,130 పరిష్కరించినట్లు పేర్కొన్నారు. ఇంకా 18,255 పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఓటు తొలగించాలంటూ ఫారం-7, 1,12,266 వస్తే 87,560 పరిష్కరించగా, 24,706 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. మార్పులపై ఫారం-8 94,461 రాగా వాటిలో 84,671 పరిష్కరించగా, 9790 పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్ చెప్పారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేయని వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయవచ్చన్నారు. అయితే వాటిపై విచారణ అనేది జనవరి ఆరు తర్వాతనే చేపట్టనున్నట్లు వివరించారు.

వస్త్ర పరిశ్రమను కాపాడేందుకు చర్యలు

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు వినతి



కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే వసంత, అసోసియేషన్ సభ్యులు

నగరంపాలెం : దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న వస్త్ర పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించడానికి, ఈ రంగం అభ్యున్నతికి చర్యలు చేపట్టాలని కోరుతూ.. నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఏపీ టెక్స్‌టైల్స్ మిల్స్ అసోసియేషన్ సభ్యులు శనివారం విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో మంత్రిని కలిసి వినతిని సమర్పించారు. ఈ విషయాలపై మంత్రి సానుకూలంగా స్పందించారు. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు వినతిపత్రం అందించిన వారిలో అసోసియేషన్ సభ్యులు కోటిరావు, రఘురామిరెడ్డి, పున్నయ్య చౌదరి, బెనర్జీ, పృథ్వీ ఉన్నారు.

గిరిదుర్గం అభివృద్ధికి శ్రీకారం

అటవీశాఖ అధికారి రామచంద్రరావు

యడ్లపాడు: చారిత్రక సంపదను భావితరాలకు చేరువ చేయడమే లక్ష్యంగా కొండవీడుకోటపై అభివృద్ధి పనులు చేస్తున్నామని పల్నాడు జిల్లా అటవీశాఖ అధికారి ఎన్.రామచంద్రరావు తెలిపారు. యడ్లపాడు మండలం కొండవీడుకోటను శనివారం సందర్శించారు. ఘాట్‌రోడ్డు, కొండపై ఉన్న వివిధ కట్టడాలు, ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు.

అభివృద్ధి బాటలో మహాద్వారం..

రాష్ట్ర ప్రభుత్వం కొండవీడుకోట అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని వివరించారు. మంత్రి విడదల రజిని నేతృత్వంలో ఇప్పటికే నగరవనం ద్వారా పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. తాజాగా కొండపై స్వాగత ద్వారానికి సమీపాన ఉన్న తూర్పు ముఖద్వారం అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కొండపై ఉన్న ప్రాచీన కట్టడాల్లో అతిపెద్దది, కొండవీడు గిరిదుర్గంలోకి ప్రవేశించే ఈ మహాద్వారం ఎంతో ప్రధానమైందని చెప్పారు. దీనిని తూర్పు ద్వారంగా పిలుస్తారన్నారు. కొండవీడుకు వచ్చే సందర్శకులు ఇప్పటి వరకు దీని వెనుక భాగం మాత్రమే చూసే వీలుందని, ఇకపై దీని చుట్టూ తిరిగి చూసేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. సుమారు రూ.3 లక్షల అంచనా వ్యయంతో ఆయా పనులను 15 రోజుల్లోనే అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు.

వీటితో పాటు బ్రిటిష్ బంగ్లాను కూడా బాగు చేసి, చెరువులో బోటింగ్ నిమిత్తం అవసరమైన జెట్టి(బోటింగ్‌స్టాండ్), టికెట్ కౌంటర్, జలవిహారానికి వచ్చిన వారికి షెల్టర్ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నరసరావుపేట ఫారెస్ట్‌రేంజ్ ఆఫీసర్ వెంకట రమణ, కొండవీడు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పి.రాజు, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



తూర్పు ద్వారం పనులు పరిశీలిసున్న జిల్లా అటవీశాఖ అధికారి రామచంద్రరావు

క్లుప్తంగా

రైలు ప్రయాణికుల భద్రతే లక్ష్యం

సికింద్రాబాద్ సర్కిల్ రైల్వే సేఫ్టీ ఆఫ్ కమిషనర్ మాధవి



లక్ష్మీపురం: సౌత్ సెంట్రల్ రైల్వే పరిధిలోని స్టేషన్లలో ప్రమాదాల్ని అరికట్టేందుకు ప్రయాణికులకు అవగాహన కల్పించి వారిలో చైతన్యాన్ని తీసుకురావాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ సర్కిల్ రైల్వే సేఫ్టీ ఆఫ్ కమిషనర్ మాధవి తెలిపారు. గుంటూరు రైల్వే స్టేషన్‌లో సిగ్నలింగ్ వ్యవస్థ, రక్షణ తీరును శనివారం ఆమె గుంటూరు డివిజన్ అధికారులతో కలసి తనిఖీ చేశారు. ముందుగా ఆమె సికింద్రాబాద్ నుంచి గుంటూరు వైపు వచ్చే శబరి ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైల్వేస్టేషన్లలో ప్రయాణికుల రక్షణపై నిర్లక్ష్యం వహించరాదని సిబ్బందికి సూచించారు. బోగిల్లో కిటికీల వద్ద కూర్చునే ప్రయాణికులకు జాగ్రత్తలపై కచ్చితంగా అవగాహన కల్పించాలని తెలిపారు. పలు ప్రాంతాల్లో నాటకాలు, కరపత్రాల ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రధానంగా రైలులో ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలిగించరాదని, రైల్వే అధికారులు కూడా దురుసుతో వ్యవహరించరాదని తెలిపారు. రైల్వేస్టేషన్లతో పాటు రైలులో రక్షణ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని అధికారులకు సూచించారు. దక్షిణ మధ్య రైల్వేలో సిగ్నలింగ్ వ్యవస్థను మరింత ఆధునీకరించాలని చెప్పారు. గుంటూరు రైల్వే స్టేషన్‌లో సిగ్నలింగ్ వ్యవస్థపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఆర్ఎం రామకృష్ణ, ఏడీఆర్ఎం సైమాన్, ఆర్.శ్రీనివాస్, సీనియర్ డీవోఎం కిరణ్‌కుమార్, సీనియర్ డీఎస్‌టీఈ బి.లక్ష్మణ్, డీఎస్‌వో విజయకీర్తి, డివిజన్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కార్మికుడు మృతి

మార్టూరు: క్వారీలో ప్రమాదవశాత్తు మట్టి పెళ్లలు విరిగిపడి ఓ కార్మికుడు మృతి చెందాడు. ఈఘటన నాగరాజుపల్లి గ్రామంలో శనివారం జరిగింది. ఎస్ఐ ఎస్.శ్రీనివాసరావు వివరాల మేరకు.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మొహిద్దీన్‌పూర్ గ్రామానికి చెందిన అర్జున్ యాదవ్ (36) స్థానికంగా ఓ స్టోన్ క్రషర్‌లో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇటీవల కురిసిన వర్షాలకు క్రషర్‌లోని మట్టి పెళ్లలు జారి అర్జున్‌యాదవ్‌పై పడటంతో స్థానికులు గమనించి మట్టి పెళ్లలను తొలగించి పక్కకు లాగారు. అప్పటికే అర్జున్ యాదవ్ మృతి చెందినట్లు గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ ఘటనాస్థలికి చేరుకొని పరిశీలించారు.

ఎక్కువ ఓటరు దరఖాస్తు చేసిన వారిపై కేసులు

ఎన్నికల అధికారులకు కలెక్టర్ శివశంకర్ సూచన



ఎన్నికల అధికారులతో సమీక్ష చేస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: ఎక్కువ సంఖ్యలో ఓటరు దరఖాస్తు చేసిన వారిపై పోలీసులచే సమగ్ర విచారణ నిర్వహించి అనంతరం అవసరమైతే వారి మీద సెక్షన్ 31 కింద కేసులు నమోదు చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎలక్ట్రోరల్ అధికారి, కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం ప్రత్యేక సారాంశ సవరణ–2024 పై ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో కార్యాలయంలోని ఎస్సార్ శంకరన్న వీడియో కాన్ఫరెన్స్ హాలులో సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. పలు రాజకీయ పార్టీలు లేవనెత్తిన అంశాలపై కులంకశంగా పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అలాగే శాశ్వత వలసలు, తాత్కాలిక వలసలు, డబుల్ ఎంట్రీలపై అవసరమైన వారికి నోటీసులు ఇచ్చి తదనుగుణంగా చర్యలు తీసుకోవాలన్నారు. చనిపోయిన వారి ఓట్లు తొలగింపు విషయంలో క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే 18 ఏళ్ల వయసు నిండిన వారిపై ప్రాస్పెక్టివ్ ఓటర్ నమోదు ప్రక్రియను గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలకు సంబంధించిన విధులను అతి జాగరూకతతో నిర్వహించాలని సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం పాల్గొన్నారు.

తల్లి మందలించిందని యువతి బలవన్మరణం

నాదెండ్ల: తల్లి మందలించిందని మనస్తాపానికి గురైన యువతి బలవన్మరణానికి పాల్పడి, గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. గణపవరం గ్రామానికి చెందిన నావూరి శివ కారు డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. వీరికి ఇరువురు కుమార్తెలు. రెండో కుమార్తె అఖిల (19) డిగ్రీ పూర్తి చేసి చిలకలూరిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తుంది. అయితే ఈ నెల 3వ తేదీన అఖిల డ్యూటీకి వెళ్లకపోవటంతో తల్లి మందలించింది. అదేరోజు ఉదయం 9.30 గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఎలుకల మందును కూల్‌డ్రింక్‌లో కలుపుకుని తాగింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చిలకలూరిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా, శనివారం ఉదయం 9.30 గంటలకు తుదిశ్వాస విడిచింది. తండ్రి శివ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

విద్యార్థులను శ్రద్ధగా చదివించండి

- రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్
- తుఫాన్ బాధిత విద్యార్థులకు కొత్త పుస్తకాలు
- విద్యార్థుల ఇళ్లకు వెళ్లి అందజేసిన వైనం



విద్యార్థికి పుస్తకాలు అందజేస్తున్న ప్రవీణ్ ప్రకాష్

కర్లపాలెం: తల్లిదండ్రులు విద్యార్థులను శ్రద్ధగా చదివించాలని రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ తెలిపారు. మిచాంగ్ తుఫాన్ ప్రభావం వల్ల కర్లపాలెంలో పూరిగృహాలలోకి నీరు చేరి పుస్తకాలు తడిచిన విద్యార్థుల ఇళ్లకు శనివారం ప్రవీణ్ ప్రకాష్ వెళ్లి తడిచిన పుస్తకాలు పరిశీలించి విద్యార్థులకు కొత్త పుస్తకాలు అందజేశారు. కర్లపాలెం అగ్రహారం ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థి సంజీవులు ఇంటికి వెళ్ళి కొత్త బుక్స్ అందజేశారు. అలాగే ఇందిరానగర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 2వ తరగతి విద్యార్థి యశ్వంత్‌కుమార్‌కు, 3వ తరగతి చదువుతున్న అయ్యప్పకు, పాతనందాయపాలెంలో 5వ తరగతి చదువుతున్న మహేశ్వరరెడ్డికి, గణపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సౌమ్యకు, మర్రికట్టవ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న ఉమామహేశ్వరరావుకు ప్రవీణ్ ప్రకాష్ స్వయంగా వారి ఇళ్లకు వెళ్లి కొత్త పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు చదువుకునేందుకు ప్రభుత్వం అన్ని వసతులు కలిపిస్తుందని అనుభవం కలిగిన ఉపాధ్యాయులు పాఠాలు చెబుతున్నారని తెలిపారు. అయితే తల్లిదండ్రులు తమ పిల్లలు సక్రమంగా బడికి వెళుతున్నారా, పాఠాలు చదువుతున్నారా అని ప్రతిరోజూ పరిశీలించాలని చెప్పారు. విద్యార్థులు ప్రతిరోజూ ఉదయం సాయంత్రం చదువుకోవటం, హోం వర్క్ పూర్తి చేయటం లాంటివి తల్లిదండ్రులే అలవాటు చేయాలని చెప్పారు.

మీ కష్టాలు మీ పిల్లలకు రాకుండా ఉండాలంటే వారిని శ్రద్ధగా చదివించాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రవీణ్ ప్రకాష్ వెంట బాపట్ల డీఈఓ పీవీజీ రామారావు, డెప్యూటీ డీఈఓ వెంకటేశ్వర్లు, బాపట్ల ఎంఈఓ ప్రసాద్, కర్లపాలెం ఎంఈఓలు టీయూ మనోరంజని, విజయశ్రీ, ఉపాధ్యాయులు ఉన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే జగనన్న ప్రభుత్వ లక్ష్యం

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



కొత్తపల్లి గ్రామంలో టీడీపీ నుంచి ప్రభుత్వ విప్ పీఆర్కే సమక్షంలో వైఎస్సార్‌సీపీ లోచేరిన మాజీ సర్పంచ్ గంగయ్య, లక్ష్మానాయక్, గంగ్యానాయక్, హనుమానాయక్ తదితరులు

మాచర్ల రూరల్: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి ప్రతి ఒక్క కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తూ ప్రజల వద్దకే సంక్షేమ పథకాలు తీసుకొచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనను మెచ్చి పార్టీలో చేరుతున్న ప్రతి ఒక్కరికీ భవిష్యత్‌లో సముచిత స్థానం కల్పిస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ మిరియాల గంగయ్య, అచ్చమ్మకుంట తండాకు చెందిన హనుమానాయక్, దేవ్లా నాయక్, లక్ష్మా నాయక్‌లకు చెందిన 15 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీ లోకి చేరిన సందర్భంగా వారు మాట్లాడారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను 98 శాతం అమలుపరుస్తూ ప్రతి ఒక్క కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించి వారిని సామాజికంగా, ఆర్థికంగా బలోపేతం చేసిన జగనన్న ప్రభుత్వానికి అండగా నిలుస్తున్న ప్రతి ఒక్కరికీ రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. మహాత్మాగాంధీ కలలు సాకారం చేస్తూ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి ప్రజల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తున్నారని, అలాగే రైతన్నల కోసం రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య రక్షణ కోసం వైఎస్సార్ క్లీనిక్‌లు వంటివి తమ గ్రామంలోనే ఏర్పాటు చేసి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారన్నారు. ప్రజలు ఎక్కడుంటే అధికారులుండేలా మార్పులు తీసుకొచ్చిన జగనన్న పాలనను ఆదర్శంగా తీసుకొని పలు రాష్ట్రాలు సంక్షేమ పథకాలు రూపొందించటం మనకెంతో గర్వకారణమన్నారు. ఎన్నికలలో ఓట్లు, సీట్లు కోసం మోసపూరిత వాగ్దానాలతో మళ్లీ చంద్రబాబు మనముందుకు వస్తున్నాడని, అలాంటి మాయల మరాఠి మాటలను నమ్మవద్దని, ఇచ్చిన హామీలను అమలు చేసి సంక్షేమ సారథిగా మన ముందుకు వస్తున్న జగనన్నకు అండగా నిలుద్దామన్నారు. ఈ సందర్భంగా టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరిన మిరియాల గంగయ్య, అచ్చమ్మకుంట తండాకు చెందిన రమావత్ హనుమానాయక్, దేవ్లా నాయక్, రమావత్ గ్యామానాయక్, లక్ష్మానాయక్‌తో పాటు మరో 15 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలోకి చేరారు. వీరికి ప్రభుత్వ విప్ పీఆర్కే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ఈ కార్యక్రమంలో మండల పార్టీ సీనియర్ నాయకులు బూడిద శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యులు మండ్లి పెద మల్లుస్వామి, మండల ఉపాధ్యక్షులు పోతురెడ్డి సుజాత కోటిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు అప్పిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, ఉప సర్పంచ్ కొండలు, ఎంపీటీసీ తేళ్ళూరి శ్రీనివాస రెడ్డి, ఆరికట్ల చంద్రారెడ్డి, గోగిరెడ్డి హనిమి రెడ్డి, లక్ష్మారెడ్డి, మాద్యానాయక్, రంగానాయక్, రవినాయక్, బూడిద సైదులు, నోముల కృష్ణ, వెంకట్రామయ్య, బట్టు బూషయ్య, బొల్లారెడ్డి, రంగయ్య, మేడబోయిన కోటయ్య తదితరులున్నారు.

తెగిపడ్డ విద్యుత్ హెచ్‌టీ లైను



శావల్యాపురం: భారీ లోడుతో వస్తున్న సుబాబుల్ లారీ హెచ్‌టీ విద్యుత్‌లైన్ల తాకడంతో అవి తెగిపడి పెను ప్రమాదం తప్పిన ఘటన శనివారం రాత్రి కనమర్లపూడి వద్ద చోటుచేసుకుంది. విద్యుత్ అధికారుల కథనం ప్రకారం.. స్థానిక కనమర్లపూడి వద్ద వినుకొండ నుంచి జయలక్ష్మి పవర్ ప్లాంట్‌కు వెళ్లే 33/11 కె.వి. విద్యుత్ లైను ఏర్పాటు చేశారు. రహదారి మీదుగా ఉండే ఈ లైనును భారీ లోడుతో వచ్చిన సుబాబుల్ లారీ కర్రలు తగిలి విద్యుత్ తీగలు రహదారిపై తెగి పడ్డాయి. దీంతో రెండు వైపులా పెద్ద సంఖ్యలో వాహనాలు నిలచి ట్రాఫిక్ స్తంభించింది. విషయం తెలుసుకున్న లైన్‌మెన్ సుబ్రహ్మణ్యం సంఘటనా స్థలానికి చేరుకుని ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. దీంతో సరఫరాను నిలుపుదల చేసి అడ్డంగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించడంతో ప్రమాదం తప్పింది. లారీ వెనుక ఏ వాహనం మీద ఈ తీగలు పడినా పెద్ద ప్రమాదమే జరిగి ఉండేదని సిబ్బంది పేర్కొన్నారు.

సాగర్ కాలువలో వృద్ధుడి మృతదేహం



మార్టూరు: గత నాలుగు రోజులుగా కన్పించకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధుడు సాగర్ కాలువలో శవమై కన్పించాడు. ఈఘటన శనివారం ఉదయం ద్రోణాదులలో వెలుగు చూసింది. ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు వివరాల మేరకు.. ద్రోణాదులలో నివాసముంటున్న చింతా నాగేశ్వరరావు (74) గత మంగళవారం పెన్షన్ తీసుకొని ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతని ఆచూకీ కోసం బంధువులు ఎంత వెతికినా ప్రయోజనం కన్పించలేదు. ఈక్రమంలో ద్రోణాదుల, చిమ్మిరిబండ గ్రామాల మధ్యగల సాగర్ కాలువలో తేలియాడుతున్న ఓ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. విచారణలో భాగంగా మృతదేహం నాగేశ్వరరావుదిగా గుర్తించిన ఎస్ఐ మార్టూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరద నీటిని వెంటనే బయటకు పంపాలి

రైతులకు డీఏవో నున్న వెంకటేశ్వర్లు సూచన

కాకుమాను: మిచాంగ్ తుఫాన్ కారణంగా పంట పొలాల్లో నిలిచిన నీటిని రైతులు ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది సహాయంతో సాధ్యమైనంత త్వరగా బయటకు పంపాలని జిల్లా వ్యవసాయాధికారి (డీఏవో) నున్న వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలోని లింగంగుంటపాలెం, వల్లూరు, చినలింగాయపాలెం గ్రామాల్లో నీట మునిగిన పంట పొలాల్ని శనివారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రతి ఎకరాను వ్యవసాయ సిబ్బంది పరిశీలించి, పంట నష్టపోయిన ప్రతి రైతు పేరు నమోదు చేయాలన్నారు.

తెలుగు మహాసభల జిల్లా సంచాలకుడిగా పేరిరెడ్డి

ఇంకొల్లు (చినగంజాం): రెండవ అంతర్జాతీయ తెలుగు మహాసభలు–2024 బాపట్ల జిల్లా ఉత్సవ కమిటీ సంచాలకుడిగా ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పిడవర్తి పేరిరెడ్డి ఎంపికయ్యారు. ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రెండవ అంతర్జాతీయ తెలుగు మహాసభలు 2024 జనవరి 5,6,7 తేదీల్లో రాజమహేంద్రవరంలోని గోదావరి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రాంగణంలో జరగనున్నట్లు తెలిపారు. ఈమేరకు ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ నుంచి ఆదేశాలు అందినట్లు తెలిపారు.